క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోస్గి: మండలంలోని తోగాపూర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని వ్యవసాయ, వాణిజ్య, గృహ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పుష్పలత



కృష్ణా: మండల తహసీల్దార్ వెంకటేశ్ ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మక్తల్ డిప్యూటీ తహసీల్దార్ పుష్పలతకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం ఆమె ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మదన్మోహన్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఇన్‌చార్జి తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

గుంతల పూడ్చివేత

మరికల్: మండలంలోని మాధవరం గ్రామంలో అంతర్గత రహదారులపై ఏర్పడిన గుంతలను గ్రామస్తులు సోమవారం పూడ్చివేశారు. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో వర్షపునీరు నిల్వ ఉంటూ దుర్గంధ భరితంగా మారుతున్నాయని.. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా స్వచ్ఛందంగా మట్టితో పూడ్చివేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

వాల్మీకి బోయ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నర్వ: వాల్మీకి బోయ సంఘం నర్వ గ్రామ కమిటీని సోమవారం మండల అధ్యక్షుడు అయ్యన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం మండల ప్రచార కార్యదర్శి కావలి కృష్ణ తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా కావలి చిన్న వెంకటన్న, ఉపాధ్యక్షులుగా కోట్ల వెంకటన్న, పెద్ద అంజన్న, ప్రధాన కార్యదర్శిగా కోట్ల రామకృష్ణ, కార్యదర్శిగా వెంకటన్న, ప్రచార కార్యదర్శిగా శ్రీను, కోశాధికారిగా గడ్డం ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా వెంకటన్న, గంగన్న, నర్సింహులు, పెద్ద అయ్యన్న, చంద్రప్ప, డీజే రవి, అశోక్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు, జిల్లా నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నీరజ్, గడ్డం నర్సింహులు, అశోక్, కొత్తపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి



నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకొని జాతీయస్థాయిలో సత్తా చాటాలని సేవా భారతి ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవిలో వివిధ క్రీడాంశాలపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని జిల్లా క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అదే విధంగా శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ, ఖేలో ఇండియా అథ్లెటిక్ కోచ్ హారిక దేవి పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓను కలిసిన 108 ప్రోగ్రాం మేనేజర్



నారాయణపేట: ఈఎంఆర్‌ఐ సంస్థ 108, 102 అంబులెన్స్‌ల ప్రోగ్రాం ఉమ్మడి జిల్లా మేనేజర్ రవి సోమవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ జయచంద్ర మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ఉచితంగా అందిస్తున్న 108, 102 సేవలను ప్రోగ్రాం మేనేజర్ వివరించారు. అత్యవసర సమయంలో ప్రజలు 108కు కాల్‌చేస్తే తక్షణమే స్పందించి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

చెరువు మట్టి.. చెలకకు జీవం



గురువలింగంపల్లి చెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

- ఉపాధి హామీ పథకంలో చెరువు పూడికతీత పనులు
- పంట పొలాలకు జోరుగా ఒండ్రుమట్టి తరలింపు
- రవాణా ఖర్చు ప్రభుత్వమే భరించాలని కోరుతున్న అన్నదాతలు

మాగనూర్: ఉపాధి హామీ పథకంతో కూలీలతో పాటు రైతులకు ఎంతో మేలు చేకూరుతోంది. పంటల సాగులో అడ్డగోలుగా రసాయనిక ఎరువుల వినియోగం పెరిగి భూసారం క్షీణిస్తోంది. అనుకున్న దిగుబడి రాకపోగా.. పెట్టుబడి పెరిగి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. భవిష్యత్‌లో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారుతుందనే భయం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు సేంద్రియ ఎరువుల ప్రాధాన్యం గుర్తిస్తున్నారు. ఉపాధి హామీ పథకం కూలీలతో చెరువుల్లో తొలగించే పూడిక మట్టిని ట్రాక్టర్లలో తమ పంట పొలాలకు తరలించుకుంటున్నారు. దీంతో పొలాల్లో విలువైన పోషకాలు చేరి సారవంతమవుతున్నాయి. ఒండ్రుమట్టిని పొలాల్లో వేసుకోవడం వల్ల భూసారం పెరుగుతుందని.. పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

ప్రయోజనాలన్నో..

చెరువు మట్టితో పంట పొలాలు సారవంతమవుతాయి. పొటాషియం, జింక్, నత్రజని, భాస్వరం, బోరాన్ వంటి పోషకాలు పెరుగుతాయి. పంటలో తేమశాతం పెరగడంతో నీట వినియోగం తగ్గుతుంది. చెరువు మట్టి వేసుకున్న పంట భూముల్లో క్రిమిసంహారక మందులు వాడకానికి సంబంధించి ఎకరాకు రూ. 3వేల వరకు పెట్టుబడి తగ్గుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

రెండు చెరువుల్లో పూడికతీత పనులు..

మాగనూర్ మండలంలో మొత్తం 16 గ్రామపంచాయతీలు ఉండగా.. ఈ వేసవిలో ప్రస్తుతానికి రెండు గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. మిగిలిన గ్రామాల్లో అతి త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఉపాధి హామీ అధికారులు తెలిపారు. గురువలింగంపల్లి, అమ్మపల్లి గ్రామాల్లోని చెరువుల్లోని ఒండ్రుమట్టిని ఉపాధి హామీ పథకం కూలీలు తొలగించి ట్రాక్టర్‌లో పోస్తుండగా.. రైతులు సొంత ఖర్చుతో ట్రాక్టర్‌లో పంట పొలాలకు తీసుకెళ్తున్నారు. అయితే ప్రభుత్వం ట్రాక్టర్ ఖర్చు భరిస్తే రైతులకు మరింత మేలు చేకూరుతుందని అంటున్నారు. గతంలో చెరువు మట్టిని ప్రభుత్వమే ఉచితంగా ట్రాక్టర్‌లో సరఫరా చేసేదని రైతులు గుర్తుచేస్తున్నారు.

పంటలకు మేలు..



చెరువుల్లోని ఒండ్రుమట్టి పంటలకు ఎంతో మేలు చేస్తుంది. సేంద్రియ ఎరువుగా పనిచేస్తుంది. ఉపాధి హామీ పథకంలో కూలీలతో చెరువుల్లో పూడికతీత పనులు చేయిస్తున్నారు. ప్రభుత్వమే ఒండ్రుమట్టి తరలింపునకు అయ్యే ఖర్చు భరిస్తే రైతులకు మరింత మేలు చేకూరుతుంది. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఆలోచించాలి.

– నారాయణ, రైతు, అమ్మపల్లి

భారీగా తరలిస్తారు..



గత వేసవిలో అమ్మపల్లి చెరువు నుంచి ఒండ్రుమట్టిని రైతులు పంట పొలాలకు జోరుగా తరలించుకున్నారు. ఈ ఏడాది కూడా మా గ్రామ చెరువులో ఫిష్ ఫండ్ పనులు కొనసాగుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో అన్ని గ్రామాల రైతులు ఒండ్రుమట్టిని తమ పొలాలకు తరలించుకోవచ్చు.

– నరేశ్, సీనియర్ మేటి, అమ్మపల్లి

వినియోగించుకోవాలి..



ఉపాధి హామీ పథకం కూలీలతో చెరువుల్లోని ఒండ్రుమట్టిని తవ్వించి ట్రాక్టర్‌లో పోయిస్తాం. చెరువుల నుంచి పంట పొలాలకు ఒండ్రుమట్టి తరలించే ట్రాక్టర్ ఖర్చు రైతులే భరించాల్సి ఉంది. చెరువు మట్టితో పంట పొలాలకు మేలు చేకూరుతుంది. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలి.

– మన్యం, ఏపీఓ

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు



మాగనూర్‌లో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు



కోస్గి పీఏసీఎస్ కార్యాలయంలో..

మాగనూర్: పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపొందుతుందని ఇన్‌చార్జి ఏఓ సుదర్శన్‌గౌడ్ అన్నారు. మాగనూర్ రైతు ఆగ్రోస్ సేవా కేంద్రంలో సోమవారం రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మండల రైతులకు అవసరమైన జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 30 కిలోల విత్తనాలు రెండున్నర ఎకరాలకు సరిపోతాయని తెలిపారు. క్వింటాల్ రూ. 14,250 ధర ఉండగా.. 50 శాతం సబ్సిడీ పోను రైతులకు రూ. 7,125 ధరకు విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. పచ్చిరొట్ట సాగుతో నేలలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందడంతో పాటు పంటకు బలమైన వేరు వ్యవస్థ ఏర్పడి అధిక దిగుబడులు వస్తాయన్నారు. జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నాయకులు శివరాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పి.ఆంజనేయులు, జయానందరెడ్డి, కృష్ణయ్య, సాయిబన్న, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి..

కోస్గి: రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి అన్నారు. కోస్గి పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, నాయకులు ఓం ప్రకాశ్, మోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో..

ధన్వాడ: రైతులకు అవసరమైన జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ నవీన్‌కుమార్ తెలిపారు. ధన్వాడలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో జీలుగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సీడ్ కార్పొరేషన్ సరఫరా చేసిన జీలుగ విత్తనాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 30 కేజీల బస్తా విత్తనాలకు రూ. 2,137 ధర నిర్ణయించినట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ మాధవరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, లక్ష్మయ్యగౌడ్, సుధాకర్‌రెడ్డి, నరేందర్, రాఘవేందర్‌రెడ్డి, సూరి, బాలస్వామి, నారాయణ, ఆనంద్, నర్సింహులు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘననివాళి



జిల్లా కేంద్రంలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నారాయణపేట రూరల్/మాగనూర్: కమ్యూనిస్టు యోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనునిత్యం తపించిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటరామిరెడ్డి, సహాయ కార్యదర్శి బలరాం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూస్వామ్య కుటుంబంలో జన్మించినా కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల కోసం పుచ్చలపల్లి సుందరయ్య అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. స్వాతంత్ర్యానికి పూర్వమే అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. అన్ని రకాల పదవులను అధిరోహించినా ఎలాంటి అవినీతి మరకలు లేని నేతగా, సొంత ఆస్తిని పార్టీ కోసం అందజేసిన గొప్ప వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో కాశప్ప, నరహరి, పవన్, భాను ప్రసాద్ పాల్గొన్నారు.

- మాగనూర్ బస్టాండ్ చౌరస్తాలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సీపీఎం మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని సీపీఎం జిల్లా నాయకుడు పి.ఆంజనేయులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాలు, గోవిందు, బాబు, రాఘవేంద్ర, నాయ్యాం పాల్గొన్నారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు



మాగనూర్(మక్తల్): మక్తల్ మండలంలోని సంగంబండ రోడ్డులో వీధి దీపాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరాయం వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ బిల్లుల రూపంలో ప్రభుత్వానికి భారం పడుతోంది. స్పందించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం వీధి దీపాలకు ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసిందని.. ప్రస్తుతం అధికారుల అలసత్వంతో అవి పని చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ ఆదాకు కృషి చేయాలని కోరుతున్నారు.

రైతులకు విధిగా రశీదులు ఇవ్వాలి

ఊట్కూరు: ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని ఏఓ గణేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువుల స్టాక్, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నకిలీ విత్తనాలు అంటకడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని.. అవసరమైన రైతు లు ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

సవారమ్మ దేవత ఉత్సవాలు ప్రారంభం



అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవారమ్మ దేవత ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే సమీపంలోని కృష్ణానదికి వెళ్లి పవిత్ర జలాలను జల్దిబిందెలతో తీసుకువచ్చి అమ్మవారి మూల విరాట్‌ను అభిషేకించారు. అనంతరం ఆలయంలో ప్రత్యే క పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి బోనాల సమర్పించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన తాగునీటి వసతిని కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి, హన్మంతరెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరపాలి

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని రాంపూర్‌లో ఆరు మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాల చెల్లింపులో అవకతవకలు జరిగాయని, వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రాంపూర్ గ్రామ మహిళా సంఘాల సభ్యులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో స్వయం సేవక సంఘంగా ఆరు గ్రూపులుగా ఏర్పడి గోల్డెన్ మహిళా సంఘం రూ.7లక్షలు, శ్రీవిష్ణు మహిళా సంఘం రూ.6లక్షలు, వెన్నెల మహిళా సంఘం రూ.10లక్షలు, తాజ్ మహల్ సంఘం రూ.10లక్షలు, సూర్యలక్ష్మీ మహిళా సంఘం రూ.10లక్షలు, ఆదర్శ మహిళా సంఘం రూ.10లక్షలు మహబూబ్‌నగర్ బ్రాంచ్ ఎస్‌బీఐ బ్యాంకులో ఫీల్డ్‌ఆఫీసర్ సహాయంతో రుణాలు తీసుకున్నట్లు తెలిపారు. దీంతో ప్రతినెల వాయిదాల పద్ధతిలో గార్లపహాడ్ మినీ బ్యాంకులో బ్యాగలక్ష్మికి చెల్లించారు. ఆ డబ్బులను భాగ్యలక్ష్మి తమ బ్యాంకు ఖాతాలలో జమచేయలేదని, బ్యాంకు వారిని అడిగితే వారు సమాధానం దాటవేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ప్రజావాణిలో పేర్కొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

మరికల్: మహబూబ్‌నగర్ – రాయచూర్ ప్రధాన రహదారిపై ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. మరికల్‌లో తరచూగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు గాను పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డితో కలిసి ప్రధాన రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. చౌరస్తాలో జనసంచారం అధికంగా ఉండటం.. ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉండటంతో పోలీసుల సమక్షంలో ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు, కూరగాయల టెంట్లు, తడకల షెడ్లను తొలగించారు. మరోసారి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా బీరప్ప బండారు ఉత్సవాలు



సంగంబండ బీరప్ప ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్(మక్తల్): మక్తల్ మండలంలోని సంగంబండలో బీరప్ప బండారు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారులు ఆయనకు స్వాగతం పలికి.. శాలువాతో సత్కరించారు. స్వామివారికి పూజల అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.నర్సింహాగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, చిన్న హన్మంతు, సత్యారెడ్డి, శంకర్‌రెడ్డి, నాయకులు ఎల్లలింగ, హన్మంతు, బాలప్ప, లింగప్ప, నర్సప్ప, బీరప్ప పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

మరికల్: మండలంలోని పస్పులలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగే దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం మైసమ్మ, నాగదేవత, నవగ్రహ విగ్రహాలతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గుండుమాల్ ఇంటర్ కళాశాలలో అడ్మిషన్లు



ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

కోస్గి: కొత్తగా ఏర్పాటైన గుండుమాల్ మండలంలో ఏర్పాటుచేసిన ఇంటర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు తీసుకుంటున్నామని జిల్లా ఇంటర్ విద్యాధికారి సుదర్శన్‌రావు చెప్పారు. గుండుమాల్‌కు నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నర్సింహారెడ్డిని నియమించారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి ఆధ్వర్యంలో ఆయన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డిని పలువురు అధ్యాపకులు, నాయకులు సన్మానించారు. అనంతరం డీఐఈఓ మాట్లాడుతూ.. ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలతో పాటు ఒకేషనల్, ఎంఎల్‌టీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని గుండుమాల్ మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోస్గి, మద్దూర్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విక్రంరెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు అండగా షీ టీం



కొల్లంపల్లిలో అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

నారాయణపేట రూరల్: రాష్ట్రంలోని మహిళలకు షీ టీం అండగా ఉంటుందని కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. మండలంలోని కొల్లంపల్లి దర్గా ఆవరణలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పోకిరీలు ఎవరైనా వేధింపులకు పాల్పడినా, మాయమాటలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వచ్చినా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల డీపీలతో వాట్సప్ కాల్ చేసి డబ్బులు పంపమని అడిగితే నిరాకరించాలన్నారు. తక్కువ ధరకు వస్తువులు, వాహనాలు అమ్ముతామని.. లాటరీల పేరుతో మోసం చేసేవారి నుంచి జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తుతెలియని లింక్‌లను ఓపెన్ చేయకుండా ఉండటం వల్ల సైబర్ నేరాలను అరికట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. సైబర్ నేరాలకు గురైతే టోల్‌ఫ్రీ నంబర్ 1930ను సంప్రదించాలని తెలిఆపరు. వేధింపులకు గురయ్యే బాలికలు, మహిళలు 87126 70398 నంబర్‌లో షీ టీం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నయ్య, జ్యోతి, కవిత పాల్గొన్నారు.

పేదల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మాగనూర్(మక్తల్): పేదల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేశ్‌కుమార్ అన్నారు. సోమవారం మక్తల్ ఎమ్మెల్యే నివాసగృహంలో పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మక్తల్ మండలం అనుగొండకు చెందిన పెద్ద సువ్వన్నకు రూ. 44వేలు, ఆదిత్యకు రూ. 24వేలు, భూత్పూర్‌కు చెందిన నర్సింహులుకు రూ. 30వేల చెక్కులు అందజేసినట్లు తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఆర్థికసాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం రమేశ్, గుంతలి రవి, హన్మేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మొదటి విడత బిల్లులు



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో అధికారులు, నాయకులు

కోస్గి: కోస్గి మండలం చంద్రవంచ, గుండుమాల్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మొదటి విడత బిల్లులు రూ.లక్ష చొప్పున మంజూరయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం పైలట్ ప్రాజెక్టు కింద చంద్రవంచ, ముదిరెడ్డిపల్లి గ్రామాలను ఎంపిక చేయగా.. పునాది వరకు ఇంటి నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులకు మొదటి విడత బిల్లు అందించినట్లు ఎంపీడీఓ శ్రీధర్ సోమవారం తెలిపారు. చంద్రవంచలో 10 మంది, ముదిరెడ్డిపల్లిలో 8 మంది బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అయినట్లు పేర్కొన్నారు. మిగతా లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గుండుమాల్ ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

మద్దూరు: మున్సిపాలిటీలోని రెనివట్ల గ్రామంలో రోడ్డు విస్తరణలో పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని గ్రామానికి చెందిన శంకర్, శివకుమార్, నర్సింహులు సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజకీయ ప్రభావం ఉన్న వారి ఇళ్లను వదిలేసి, సామాన్య ప్రజల ఇళ్లను కూల్చివేశారని తెలిపారు. డ్రెయినేజీ నిర్మాణంలో కూడా కొందరికి ప్రయోజనం చేకూర్చేందుకు తక్కువ విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డీపీఆర్ ఆధారంగా పనులు జరగడం లేదని.. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.